## క్లుప్తంగా

### జగనన్న సురక్ష సర్వేపై పర్యవేక్షణ



సోమవరప్పాడులో ఇంటింటా జగనన్న సురక్ష సర్వే పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కృపావరం

దెందులూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంపై అధికారులు విధిగా పర్యవేక్షణ చేయాలని ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్ఎన్ కృపావరం అన్నారు. సోమవారం సోమవరప్పాడులో అధికారులు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. సమస్యల నమోదు చేసుకుంటున్న జాబితాను పరిశీలించారు. సర్వేలో గ్రామ కార్యదర్శి ముంగర శ్రీకాంత్, వీఆర్‌ఓ ప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

**ఇంటింటా వలంటీర్ల సర్వే**

పెదవేగి : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలోని కొన్ని గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే ప్రారంభించారని ఏలూరు ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి పెంచల కిషోర్ అన్నారు. సోమవారం గార్లమడుగు, కొప్పాక గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని, సర్వే నిర్వహిస్తున్న తీరును మండల స్థాయి అధికారులతో కలిసి పర్యవేక్షించినట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

ఉంగుటూరు: బాదంపూడి వద్ద వాహనం అదుపుతప్పి పడిపోయి గాయాలపాలైన వెన్నెల కాశీ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. కైకరం గ్రామానికి చెందిన వెన్నెల కాశీ తాడేపల్లిగూడెం వైపు ఆదివారం వెళుతూ అదుపుతప్పి మోటారుసైకిల్‌తో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తొలుత తాడేపల్లిగూడెం, ఆ తరువాత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### వ్యక్తికి గాయాలు

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఏపూరు గ్రామ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు గత నెల 18న ఢీకొన్నాయి. ఈ ఘటనలో నూజివీడు మండలంలోని సీతారామపురానికి చెందిన తన్నేటి రామారావుకు గాయాలయ్యాయి. దీంతో అతడ్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సోమవారం పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గౌడ సంఘ జిల్లా కార్యదర్శిగా శంకర్‌గౌడ్

పెదవేగి : గౌడసంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా పెదవేగికి చెందిన పొన్నూరు శంకర్‌గౌడ్ నియమిస్తూ గౌడ సంఘం ఉత్తర్వులు ఇచ్చింది. జంగారెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌడ సంఘం ఈ మేరకు నిర్ణయించిందని గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలమోలు అశోక్ గౌడ్ తెలిపారు. జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమితులైన శంకర్ గౌడ్‌ను అభినందించిన అశోక్ గౌడ్ మాట్లాడుతూ గౌడసంఘం అన్నివిధాల పటిష్ట పర్చి, గౌడుల సామాజిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సంఘాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి భాగాస్వామ్యాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### హెల్మెట్ ధరించాలి

ఉంగుటూరు: ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా సోమవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వాహనదార్లకు ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద అధికారులు పలు సలహాలు, సూచనలు చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని, వేగ నియంత్రణ చేసుకోవాలని సూచించారు. టోల్ ప్లాజ మేనేజర్లు ఇంటియాజ్, లక్ష్మణరావు, హైవే యూనిట్ ఆఫీసరు ఫణి, ఐఎంటీ మేనేజర్ జగదీష్ రోడ్డు భద్రత పోలీసు సిబ్బంది బలే శ్రీనివాసు, మురళి పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజస్థాపనకు కృషి చేయాలి

భీమడోలు : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో యువత భాగస్వాములు కావాలని భీమడోలు ఎస్ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో భీమడోలు వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో యువతీ యువకులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, భవిష్యత్తు పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువత డ్రగ్స్ ఉచ్చులో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌ను వాడితే కఠిన శిక్షణ అమలవుతాయన్నారు. ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్, కళాశాల విద్యార్థులంతా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎస్ఈబీ ఎస్సై సుబ్బారావు, డిగ్రీ ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, వైద్యులు ఆల్బర్ట్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఆర్.ధనరాజు, జి.నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలులో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ, ప్రదర్శనలో పాల్గొన్న అధికారులు, యువత ఎస్ఈబీ అధికారులు, కళాశాల సిబ్బంది



మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న మానసిక నిపుణులు

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

గణపవరం: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజిలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కెమిస్ట్రీ అధ్యాపకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే సామాజిక, ఆర్థిక, ఆరోగ్యనష్టాలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, అధ్యాపకులు స్వరూపరాణి, చైతన్య, జివి రమణ, జీవీ రావు, మోహిన్ అన్సారీ ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు డీవీవీ చినసత్యనారాయణ, బి.రమేష్ పాల్గొన్నారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి**

పెదపాడు: విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తతతో ఉండాలని మానసిక వైద్యులు డాక్టరు కే హెచ్ కోమలి తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదపాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. 8,9,10 తరగతి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కోమలి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కొంతమంది మాదక ద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి పెడతోవ పడుతున్నారని చెప్పారు. మాదకద్రవ్యాలు, సిగరెట్లు, మద్యానికి బానిసలైన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తామని డాక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక విభాగం సోషల్ వర్కర్ తిరుపతి స్వామి పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు ఎంఎంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

భీమడోలు: పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురంలో ఈనెల 27వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నూతనంగా నిర్మించి గ్రామ సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని మండల వైసీపీ కన్వీనర్లు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరావు సోమవారం తెలిపారు. కొత్త భవనాల అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఎంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి వారికి పత్రాలను అందిస్తారన్నారు. తొలుత పూళ్ల వంతెన వద్ద నుంచి ఎంఎంపురం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దివంగత పుప్పాల రామ్మూర్తి నాయుడు, పుప్పాల జయకృష్ణారావు కుటుంబ సభ్యులు దానం చేసిన స్థలంలో సచివాలయం, ఆర్‌బీకేలను నిర్మిస్తామన్నారు. గ్రామంలోని పుప్పాల రామ్మూర్తి నాయుడు, జయకృష్ణారావు జయంతిని పురస్కరించుకుని ఉన్నతోద్యోగాలు చేస్తున్న వారిని ఘనంగా సత్కరిస్తామని డాక్టర్ పుప్పాల గోవర్ధన రామనుజం తెలిపారు.

# కొల్లేరు గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పైడిచింతపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కొల్లేరు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు మండలం పైడిచింతపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొల్లేరు గ్రామాల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అంతర్గత సీసీరోడ్లు, డ్రైయినేజీ, ప్రధాన రోడ్ల నిర్మాణం, సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి ఊరులో జగనన్న కాలనీ ఏర్పాటు చేశామన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు మెరక చేశామన్నారు. కొల్లేరులో పేదల సొంతింటి కల నెరవేర్చుతున్నామన్నారు. కొల్లేరు గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కొత్త పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని గుర్తు చేశారు. సాయంత్రం 5 గంటలకు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచ్ ముంగర తిమోతీ, ఉప సర్పంచ్ రేలంగి యోహాన్ ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మహాత్మ గాంధీ, అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేశారు. తర్వాత ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, ఇంజినీరింగ్ అధికారులు కృష్ణమోహన్, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, పంచాయతీ వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పైడచింతపాడులో ప్రభుత్వ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

### మంత్రి కారుమూరితో ఎమ్మెల్యే కొఠారు భేటీ

దెందులూరు: రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విజయవాడలోని మంత్రి ఛాంబర్‌లో కలిశారు. ధాన్యం సేకరణ, నగదు జమ, రైతు సమస్యలతో పాటు ఇతర శాఖాపరమైన సంబంధిత అన్ని అంశాలపై చర్చించారు. సమస్యలపై వినతిపత్రాన్ని మంత్రికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖాపరంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే తొలి అజెండాగా ప్రణాళికతో సేవలందిస్తున్నారన్నారు.



విజయవాడలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

**పుంతరోడ్డు నిర్మాణానికి చర్యలు**

పెదపాడు: అప్పనవీడు వసంతవాడ పుంతరోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హామీ ఇచ్చారు. జాతీయ రహదారిపై పెదపాడు మండలంలోని అప్పనవీడు నుంచి వసంతవాడ వెళ్లే పుంతరోడ్డు పనులను ఆయన పరిశీలించాచు. సుమారు రూ.17లక్షల వ్యయంతో 2 కిలోమీటర్లు మేర చేపడుతున్న రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పెదపాడు మండలంలోని తోటగూడెం, రాజుపేట, గోగుంట, వసంతవాడ గ్రామాల ప్రజలకు, ఆప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు వసంతవాడ, గోగుంట అప్పనవీడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### పాఠశాలల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ పాత్ర కీలకం

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి పేరెంట్స్ కమిటీల పాత్ర కీలమని గుండుగొలను సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని 45 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తొలి రోజు సోమవారం 35 పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. మండలంలోని గుండుగొలను ప్రాథమిక పాఠశాల, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల్లో ఉత్సాహభరిత వాతావరణంలో పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. అజెండా అంశాలను కమిటీ సభ్యులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేసారు. గుండుగొలను పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు ఎస్.విజయశాంతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారాలు అవసరమన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నాడు–నేడు పథకంలో సర్కారీ బడుల రూపురేఖలు మార్చారని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న పథకాలను హెచ్ఎం పాశం పాండురంగారావు వివరించారు. అన్నేవారిగూడెంలో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న చిన్నారులు ఇంగ్లీషులో మాట్లాడడం, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై టీవీల్లో ప్రసంగించడంతో తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకరించారు. అనంతరం గుండుగొలను 131 మందికి, అన్నేవారిగూడెంలో 126 మందికి విద్యాకానుక కిట్లను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ నాగనబోయిన వెంకటేశ్వరమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ యోగేష్, మహిళా కానిస్టేబుల్ అరుణకుమారి, టీచర్లు, కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.



గుండుగొలనులో చిన్నారికి బ్యాగు, బూట్లు అందిస్తున్న సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్

**జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ**

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నారని మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్ఎన్ కృపావరం అన్నారు. సోమవారం సోమవరప్పాడులో ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతి చిన్నారిని విధిగా పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్రకుమార్, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, గ్రామ కార్యదర్శి ముంగర శ్రీకాంత్, వీఆర్‌ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

### పిల్లలను బడులకు పంపించాలి

ఉంగుటూరు: ప్రభుత్వ కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి–2 శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు ఉర్దూ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి రెండురోజుల్లో తల్లి ఖాతాలకు వేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని దీనిలో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి వలంటీర్లు, మండల స్థాయి అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాలను అందించడంతోపాటు, ప్రభుత్వం అందించే పథకాలు వారికి అందకపోతే మరలా నమోదు చేసి ఆ పథకం అందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, తాత సత్యనారాయణ కార్యదర్శి ప్రసాద్ మహిళా పోలీసు జ్యోతి, ఏఎన్ఎం మౌనిక వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ తాతా రమ్య

### సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత ఉద్యోగులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. రుణాలు, వ్యక్తిగత అవసరాలు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, ఇతర సమస్యలపై వినతులు ఎమ్మెల్యేకు అందచేశారు.

**అధికారుల స్పందన**

సోమవారం దెందులూరు తహసీల్దార్‌కార్యాలయంలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి వినతులు స్వీకరించారు. గత సోమవారం స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై అన్ని శాఖాల అధికారులతో తహసీల్దార్, ఎంపీడీఓలు సమీక్షించారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### దెందులూరులో సోషల్ ఆడిట్ తనిఖీ బృందాలు

దెందులూరు : జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండలం సోషల్ ఆడిట్‌కు సోమవారం దెందులూరుకి బృందాలు చేరుకున్నాయని మండల ఏపీఓ దశరధ రాంజీ అన్నారు. సోమవారం దెందులూరులో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేది వరకు దెందులూరు మండలంలో జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందాలు, గ్రామసభలు నిర్వహించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఒకరు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ 9 మంది దెందులూరు ఉపాధి కార్యాలయానికి వచ్చారన్నారు. విలేజ్ సోషల్ ఆడిటర్లను ఎంపిక చేసి శిక్షణనిచ్చి త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సోషల్ ఆడిట్ తనిఖీ బృందాలు వెళతాయని ఏపీఓ రాంజీ తెలిపారు.

### విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన నిర్మించాలి



అమరావతిలో జెన్‌కో ఎండీ విజయానంద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గణపవరంలో ఏర్పాటు చేయనున్న 132–33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతులు మంజూరుచేసి, త్వరగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు జెన్‌కో సీఎండీ విజయానంద్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం అమరావతిలో నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు. గతేడాది గణపవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గణపవరంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి హామీ ఇచ్చారని, దీనికి అవసరమైన ఐదెకరాల భూమిని రైతుల నుంచి సేకరించి ఇటీవల వారికి సొమ్ము చెల్లించామని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు టెండర్లు త్వరగా పూర్తిచేసి నిర్మాణం ప్రారంభించాలని కోరారు. లో ఓల్టేజీ సమస్యలతో పరిసర గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే చాలావరకూ విద్యుత్ సమస్యలు తొలగిపోతాయని అన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లు, పాత ఇందిరమ్మ కాలనీల్లో నూతనంగా నిర్మించాల్సిన విద్యుత్ లైన్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

### మానవత మండల శాఖ అధ్యక్షుడిగా రవి

ఉంగుటూరు: మానవత సేవలు మండలంలో మరవలేనివని పలువురు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురం లయన్సు ఆడిటోరియంలో మండల మానవత సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గం ఎంపిక కోసం ఏర్పాటైన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు వేగేశ్న సూర్యానారాయణరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సాగిరాజు జానికిరామరాజు, ప్రతినిధులు జి.బుల్లియ్య, పొత్తూరి శ్రీనివాసరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఉంగుటూరు మండల మానవత శాఖ అధ్యక్షుడిగా గంజిరవి కుమార్, ఉపాధ్యక్షుడిగా ముళ్లపూడి కృష్ణకుమార్, కార్యదర్శిగా పిల్లా రామకృష్ణ, కోశాధికారిగా కె.వి.నాగేంద్రరావు, సహాయ కార్యదర్శిగా కోనే వీర వెంకటసత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా దండమూడి సరేంద్ర, తమ్మిన శ్రీనివాసరావు, కంబంపాటి సూరిబాబు ఎన్నికయ్యారు. సోమవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.



